# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | బుధవారం 30, సెప్టెంబర్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1




## కవిత ప్రశ్నలకే సమాధానాలు లేవు

- హరీశ్ రావును గుంటనక్క అని కవితే అన్నారన్న అద్దంకి
- కేసీఆర్ కుమారుడు కావడమే కేటీఆర్ ఏకైక అర్హత అని విమర్శ
- బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులపై కేసులు పెట్టారని ఆరోపణ



కేటీఆర్‌కు సిరిసిల్లలో
## సినిమా చూపిస్తాం

- రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న చామల
- సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ
- ప్రధాన ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ





# ఓట్ చోరీపై దూకుడుగా వెళ్దాం

కాంగ్రెస్ కార్యకర్తలు యాక్టివ్ అవ్వాలి

- రెండేళ్లుగా ఓట్ల చోరీ అంశాన్ని ప్రస్తావిస్తున్నానన్న రాహుల్
- తొలుత పార్టీ నేతల్లో కొందరు తన వాదనను అంగీకరించలేదని వ్యాఖ్య
- ఇప్పుడు అందరూ అంశాన్ని అర్థం చేసుకున్నారని వెల్లడి
- ఎన్నికల ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచన
- ఈవీఎంలపై ప్రశ్నలను బలంగా ప్రస్తావించాలని సూచన
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థపై చర్చ
- ఢిల్లీ బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపును ప్రస్తావించిన రాహుల్



# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

- కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం
- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, మిగతా 2 లో..

## నేడు సిరిసిల్లకు
# సీఎం రేవంత్

- రూ.345.78 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రగుడు బైపాస్ వద్ద భారీ బహిరంగ సభ
- నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారతకు పెద్దపీట
- విద్య, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం పర్యటన
- నేతన్నలకు 'నేతన్న బజార్'.. మహిళా శక్తి భవనానికి శ్రీకారం
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.99.40 కోట్లతో పనులు
- కొత్త ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలకు శంకుస్థాపన



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ముఖ్యమంత్రి హోదాలో ఎన్. రేవంత్ రెడ్డి తొలిసారిగా ఈ నెల 30న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా మూడుసార్లు సిరిసిల్ల గడ్డపై అడుగుపెట్టిన ఆయన, ఇప్పుడు ముఖ్యమంత్రిగా జిల్లా సమగ్ర రూపురేఖలను మార్చేలా రూ. 345.78 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా సిరిసిల్ల రగుడు బైపాస్ సమీపంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. స్థానిక నేతన్నల సంక్షేమం, మహిళా సాధికారత, విద్యా రంగం , మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం మిగతా 2 లో..

# మేం ట్యాంపరింగ్ చేస్తే 400 సీట్లు వచ్చేవి

- ఓట్ల ట్యాంపరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్‌కు బీజేపీ కౌంటర్
- రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించాలని డిమాండ్
- సోనియా గాంధీ ఓటుపై రాహుల్ సమాధానం చెప్పాలన్న అరవింద్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ఓట్ల ట్యాంపరింగ్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ఓట్లను ట్యాంపరింగ్ చేసి ఉంటే లోక్‌సభలో 400 సీట్లు గెలిచేవాళ్లమని, కేవలం 240 సీట్లతో ఎందుకు సరిపెట్టుకుంటామని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని చూసి ప్రజలు ఛీ కొడుతున్నారని, భారత ప్రజాస్వామ్యాన్ని ఆయన నవ్వులపాలు చేస్తున్నారని మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు.

ఈవీఎంలను రాజీవ్ గాంధీ హయాంలోనే ప్రవేశపెట్టారని, వీవీప్యాట్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈటల గుర్తుచేశారు. ఇదే అంశంపై ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ ఉన్నంతవరకు 'కాంగ్రెస్ ముక్త్ భారత్' సాధ్యమేనని ఎద్దేవా చేశారు. "పౌరసత్వానికి ముందే సోనియా గాంధీకి ఓటు ఎలా వచ్చిందో రాహుల్ చెప్పాలని" ఆయన డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో గెలవలేకే మిగతా 2లో..



## సీఎం సొంత నియోజకవర్గంలో
# కూల్చివేతలా?

- మద్దూరులో పేదల ఇళ్ల కూల్చివేతపై హరీశ్‌రావు ఆగ్రహం
- రాత్రికి రాత్రే ఇళ్లపై బుల్డోజర్లు ప్రయోగించారంటూ ఆరోపణ
- సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసిన బీఆర్ఎస్ నేత
- నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టారని ఆరోపణ
- న్యాయస్థానాల తీర్పులను సైతం పట్టించుకోవడం లేదని విమర్శ
- పోలీసులను అడ్డుపెట్టుకుని బుల్డోజర్ రాజ్ నడుపుతున్నారని ఆరోపణ
- నిరుపేదలను అర్ధరాత్రి రోడ్డున పడేయడం కర్కశమని వ్యాఖ్య
- బాధితులకు ప్రభుత్వం తక్షణమే బాధ్యత వహించాలని డిమాండ్



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** మద్దూరులో పేదల ఇళ్లను రాత్రికి రాత్రే బుల్డోజర్లతో కూల్చివేశారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. 'కొడంగల్ బిడ్డను' అని చెప్పుకొనే ముఖ్యమంత్రి.. సొంత నియోజకవర్గ మిగతా 2లో..

# దళితులు, ఆదివాసీలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలి

- దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయి
- ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం
- న్యూఢిల్లీలో దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సమావేశం
- కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం
- అంటరానితనానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడారు
- దళితుల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం వచ్చింది
- ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాలి
- ఖర్గే హాజరైన వేదికను శుద్ధి చేయడం దారుణం
- బీజేపీ పాలనలో రెండో తరగతి పౌరులుగా దళితులు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దళితులపై వివక్ష, దాడులు కొనసాగుతున్నాయని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దళితులు, ఆదివాసీలు తమ ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన మిగతా 2లో..

## మరో తుగ్లక్ నిర్ణయం తీసుకున్న
# కాంగ్రెస్ ప్రభుత్వం

- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ
- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిగతా 2లో..



# నేడు సిరిసిల్లకు సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

ఈ భారీ నిధులను కేటాయించింది.

**నేతన్నలకు 'నేతన్న బజార్' కొండంత అండ..**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, చేనేతపవర్లూమ్ కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. సిరిసిల్ల సాంచాలపై ఉత్పత్తి చేసే పెట్టికోట్, పాలియెస్టర్ వస్త్రాల మార్కెటింగ్‌కు వీలుగా కొత్తగా 'నేతన్న బజార్'ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశారు. చేనేత, పవర్‌లూమ్ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. దీనితో పాటు మున్సిపాలిటీ పరిధిలోని పెద్దూరులో మోడల్‌గా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, జీవనోపాధి శిక్షణలతో పాటు వారు ఉత్పత్తి చేసే వస్తువుల విక్రయాలకు ఈ భవనం ప్రధాన కేంద్రంగా నిలవనుంది.

**రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు**

జిల్లాలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో రూ. 200 కోట్ల వ్యయంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను' నిర్మించనున్నారు. పెద్దూరులో 18 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించిన ఈ విద్యా సముదాయంలో 5 నుంచి 12వ తరగతి వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు వసతి, విద్య అందించేలా 64 తరగతి గదులు, డార్మిటరీలు, డైనింగ్ బ్లాక్, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయనున్నారు. దీనికితోడు సిరిసిల్ల, కోనరావుపేటలలో ప్రీప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయి వసతులు, సైన్స్ ల్యాబ్‌లు, ఐటీ మౌలిక వసతులతో 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' నిర్మాణాలకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.

**రాజన్న ఆలయాభివృద్ధికి ₹99.40 కోట్లు..**

**కొత్త ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రూ. 99.40 కోట్లతో చేపట్టే 26 రకాల అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో ప్రాకారాలు, గోపురాలు, మండపాల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుదీకరణ, షాపింగ్ కాంప్లెక్సులు ఉన్నాయి. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా సిరిసిల్ల, వేములవాడల్లో రెండు కొత్త ఆర్‌డీఓ కార్యాలయాలు, నాలుగు తహసీల్దార్ కార్యాలయాలు (తంగళ్లపల్లి, వీర్నపల్లి, వేములవాడ రూరల్, రుద్రంగి), సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన జరగనుంది. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం రుద్రంగిలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించనున్నారు. రక్షణ రంగంలో భాగంగా వేములవాడలో కొత్తగా మహిళా పోలీస్ స్టేషన్, వేములవాడసిరిసిల్ల పట్టణాల్లో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను ప్రభుత్వం అందుబాటులోకి తేనుంది.

## కేటీఆర్‌కు సిరిసిల్లలో
# సినిమా చూపిస్తాం

- **రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనలో కేటీఆర్ భూ బాగోతాలు బయటపెడతారన్న చామల**
- **సీఎంను సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని చామల విమర్శ**
- **ప్రధాన ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేపు సిరిసిల్లలో కేటీఆర్‌కు అసలైన సినిమా చూపిస్తామని, ఆ రోజును ఆయన జీవితంలో మర్చిపోలేరని హెచ్చరించారు. గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు రాకముందే తనపై ఉన్న ఆరోపణలను బయటపెట్టాలని కేటీఆర్ సవాల్ చేయడంపై చామల తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రిని సవాల్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదని, ఆయన కేవలం ఒక ఎమ్మెల్యే మాత్రమేనని అన్నారు. సిరిసిల్ల ప్రజల ముందే కేటీఆర్ భూ బాగోతాలను రేవంత్ బయటపెడతారని, ఆయన అసలు స్వరూపం దేశమంతటికీ తెలుస్తుందని అన్నారు. గత తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లలో నిజమైన అభివృద్ధి జరగలేదని, కేవలం శంకుస్థాపనలకే పరిమితమయ్యారని ఆరోపించారు. చిన్న వర్షానికే కలెక్టరేట్ భవనంలోకి వెళ్లలేని పరిస్థితి ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్లలో రూ.175 కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిందని, సీఎం పర్యటనలో రూ.345.75 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, నేతన్నల కోసం ప్రత్యేక బజార్ వంటి పనులను వివరించారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజనల్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టులను బీఆర్ఎస్ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

## మేం ట్యాంపరింగ్ చేస్తే
# 400 సీట్లు వచ్చేవి

మొదటిపేజీ తరువాయి



కాంగ్రెస్ పార్టీ లేనిపోని సమస్యలను సృష్టిస్తోందని అర్వింద్ ఆరోపించారు. దేశాన్ని, హిందువులను కించపరచడమే లక్ష్యంగా రాహుల్ పనిచేస్తున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేత పదవి నుంచి వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- **దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం**
- **ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య**
- **ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ**



హైదరాబాద్, (ప్రజాస్వరం):

రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

# నాతో పెట్టుకుంటే ఆధారాలు బయటపెడతా..

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు.

ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. సాయం కోరుతూ వచ్చిన మహిళతోనూ అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు.

గణేశ్ నిమజ్జనోత్సవంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఎంతమందిని బతిమాలుకున్నారో గణేశుడికి, వారి అంతరాత్మకు తెలుసని కవిత వ్యాఖ్యానించారు. తాను విషనాగుల మాటలు విని మాట్లాడనని, నిర్దిష్టమైన ఆధారాలతోనే మాట్లాడతానని స్పష్టం చేశారు. తనతో పెట్టుకోవద్దని హెచ్చరిక జారీ చేశారు.





# కవిత ప్రశ్నలకే సమాధానాలు లేవు

- **హరీశ్ రావును గుంటనక్క అని కవితే అన్నారన్న అద్దంకి**
- **కేసీఆర్ కుమారుడు కావడమే కేటీఆర్ ఏకైక అర్హత అని విమర్శ**
- **బీఆర్ఎస్ హయాంలో ఉద్యమకారులపై కేసులు పెట్టారని ఆరోపణ**

హైదరాబాద్, (ప్రజాస్వరం):

బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావుపై తెలంగాణ ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సొంత కుటుంబ సభ్యురాలైన కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు కూడా వారిద్దరి వద్ద సమాధానాలు లేవని ఆయన ఎద్దేవా చేశారు. డబ్బులు ఖర్చు పెట్టి కృత్రిమ ప్రచారాలు, పాటలు చేయించడం మాని, ముందు ఇంట్లో చెల్లి అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని కేటీఆర్ కు హితవు పలికారు.

హరీశ్ రావును 'గుంటనక్క' అని కవితే అన్నారని అద్దంకి తెలిపారు. కేసీఆర్ కొడుకు కావడం తప్ప కేటీఆర్‌కు నాయకత్వ అర్హతలేమీ లేవని, ఆ కుటుంబ సంబంధం లేకపోతే ఆయనకు రాజకీయ మనుగడ సున్నా అని విమర్శించారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడాన్ని కేటీఆర్ తప్పుబట్టడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమని అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారి పార్టీ ఎమ్మెల్యేలకు నిధులు దోచుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని విమర్శించారు. అదే సమయంలో సొంత పార్టీలోని గిరిజన ఎమ్మెల్యేల విషయంలో మాత్రం వివక్ష చూపారని అద్దంకి ఆరోపించారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తులతో కలిసి కేసీఆర్ కుటుంబం ఫామ్‌హౌస్‌లు, అక్రమ వ్యాపారాలు నడిపిందని దుయ్యబట్టారు. పదేళ్ల పాలనలో తెలంగాణ ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసి, కోదండరాం, మందకృష్ణ మాదిగ వంటి ఉద్యమ నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపారని విమర్శించారు. బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి రానివ్వకూడదని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయించుకున్నారని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

# సీఎం సొంత నియోజకవర్గంలో కూల్చివేతలా?

మొదటిపేజీ తరువాయి

ప్రజల ఇళ్లనే కూల్చివేయడం ఏమిటని నిలదీశారు.

కనీసం నోటీసులు ఇవ్వకుండా, న్యాయస్థానాల తీర్పులను సైతం లెక్కచేయకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని కూల్చివేతలు చేపట్టడం ప్రజాపాలన కాదని హరీశ్‌రావు విమర్శించారు. దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్న నిరుపేదలను అర్ధరాత్రి రోడ్డున పడేయడం అత్యంత కర్కశమైన చర్యగా అభివర్ణించారు.



అధికారం ఉందనే కారణంతో ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరించకూడదని హరీశ్‌రావు అన్నారు. ఇళ్లను కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తావించే యూపీఏ హయాంలో తీసుకొచ్చిన భూసేకరణ చట్టం2013 ప్రకారం ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి న్యాయమైన పరిహారం, మెరుగైన పునరావాసం కల్పించాలని కోరారు. పేదల బతుకులను ఛిన్నాభిన్నం చేస్తున్న ఈ చర్యలను బీఆర్ఎస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని హరీశ్‌రావు తెలిపారు. బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఓట్ చోరీపై దూకుడుగా వెళ్దాం

- **కాంగ్రెస్ కార్యకర్తలు యాక్టివ్ అవ్వాలి**
- **రెండేళ్లుగా ఓట్ల చోరీ అంశాన్ని ప్రస్తావిస్తున్నానన్న రాహుల్**
- **తొలుత పార్టీ నేతల్లో కొందరు తన వాదనను అంగీకరించలేదని వ్యాఖ్య**
- **ఇప్పుడు అందరూ అంశాన్ని అర్థం చేసుకున్నారని వెల్లడి**
- **ఎన్నికల ప్రక్రియపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచన**
- **ఈవీఎంలపై ప్రశ్నలను బలంగా ప్రస్తావించాలని సూచన**
- **సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థపై చర్చ**
- **ఢిల్లీ బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపును ప్రస్తావించిన రాహుల్**



న్యూఢిల్లీ, (ప్రజాస్వరం):

ఓట్ల చోరీ అంశాన్ని తాను గత రెండేళ్లుగా ప్రస్తావిస్తున్నప్పటికీ కాంగ్రెస్ నేతల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించలేదని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పుడు పార్టీ నేతలు ఈ అంశాన్ని అర్థం చేసుకున్నారని ఆయన వ్యాఖ్యానించినట్లు వార్తలు వెలువడ్డాయి. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాహుల్ కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.

ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని రాహుల్ పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. ఓటర్ల జాబితాల్లో అవకతవకలతో పాటు ఈవీఎంలకు సంబంధించిన ప్రశ్నలను కూడా బహిరంగంగా ప్రస్తావించాలని చెప్పినట్లు సమాచారం. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ గతంలో చేసిన ఆరోపణలను కూడా ఆయన సమావేశంలో ప్రస్తావించినట్లు వార్తలు వచ్చాయి.

**బేలా ఎస్టేట్‌పై రాహుల్ ఆరోపణలు**

ఢిల్లీ యమునా తీరంలోని బేలా ఎస్టేట్‌లో ఓటర్ల పేర్ల తొలగింపుపై రాహుల్‌గాంధీ సోమవారం ప్రశ్నలు లేవనెత్తారు. అక్కడ 728 మంది ఓటర్లు ఉండగా.. SIR అనంతరం ముసాయిదా ఓటర్ల జాబితాలో ఒక్కరి పేరు మాత్రమే మిగిలిందని ఆయన ఆరోపించారు. మిగిలిన 727 మంది పేర్లు తొలగించారని పేర్కొన్నారు. ఈ అంశంపై స్థానిక ఎస్‌డీఎంతో రాహుల్ మాట్లాడిన వీడియోను కూడా సోషల్ మీడియాలో విడుదల చేశారు.

అయితే 727 మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి పూర్తిగా తొలగించినట్లు కాకుండా ఏఎస్‌డీడీ జాబితాలో ఉంచినట్లు ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. బేలా ఎస్టేట్‌లో గతంలో ఇళ్లు కూల్చివేయడం, అక్కడి నివాస పరిస్థితుల్లో మార్పుల నేపథ్యంలో ఈ పేర్లను ఆ జాబితాలో చేర్చినట్లు ఈసీ పేర్కొంది.

**ఓటర్ల జాబితా సవరణపై వివాదం**

సర్ ప్రక్రియ, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. మరోవైపు ఎన్నికల సంఘం సర్ కు సంబంధించిన చర్యలు చట్టపరమైన ప్రక్రియకు అనుగుణంగానే జరుగుతున్నాయని చెబుతోంది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశంలో ఎన్నికల వ్యవస్థపై పార్టీ తదుపరి కార్యాచరణపై చర్చ జరిగింది. కాగా, ఓటర్ల జాబితా, సర్ అంశాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఎన్నికల ప్రక్రియపై కాంగ్రెస్ తన రాజకీయ ప్రచారాన్ని కొనసాగించాలని రాహుల్ సూచించినట్లు సమాచారం.

# మరో తుగ్లక్ నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు.

చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గు టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు.



దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

# దళితులు, ఆదివాసీలు ఐక్యంగా హక్కుల కోసం పోరాడాలి

మొదటిపేజీ తరువాయి

అవసరం ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన దళితఆదివాసీ ఆత్మగౌరవ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి మంత్రులు సీతక్క, వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి తదితరులు హాజరయ్యారు. కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు, దళిత, ఆదివాసీ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంటరానితనానికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ అధ్యక్షతన తీర్మానం జరిగిందని భట్టి విక్రమార్క గుర్తు చేశారు. అనంతరం దళితుల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తీసుకొచ్చారని తెలిపారు. మనుధర్మ శాస్త్రం పేరుతో వెనుకబడిన వర్గాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. దళితులపై అట్రాసిటీలు ఆగాలని డిమాండ్ చేశారు.

దేశంలోని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, గౌరవం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని భట్టి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఉత్తరాఖండ్‌లో ఎదురైన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. అంచెలంచెలుగా ఎదిగిన ఖర్గే సీఎల్పీ నేతగా, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా, ప్రస్తుతం ఏఐసీసీ అధ్యక్షుడిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఖర్గే హాజరైన వేదికను అనంతరం శుద్ధి చేయడం అత్యంత దారుణమని భట్టి విమర్శించారు. బీజేపీ పాలనలో దళితులను రెండో తరగతి పౌరులుగా చూస్తున్నారనే భావన కలుగుతోందని ఆరోపించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, అప్పుడే ప్రతి ఒక్కరికీ రక్షణ, సమానత్వం దక్కుతాయని అన్నారు.

**మనువాద భావజాలాన్ని అమలు చేస్తున్నారని ఆరోపణ**

దేశంలో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా బీజేపీ పాలన కొనసాగుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. సమాజానికి వ్యతిరేకంగా మనువాద భావజాలాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో అంటరానితనాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు.

ఉత్తరాఖండ్‌లో ఖర్గే సమావేశం అనంతరం జరిగిన పరిణామాలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోందని దయాకర్ అన్నారు. తెలంగాణలో గతంలో కాంగ్రెస్ దళిత నేతలు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన సందర్భంగా పసుపు నీళ్లు చల్లిన ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. ఖర్గేపై జరిగిన ఘటనను రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అద్దంకి దయాకర్ అన్నారు. ఈ విషయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూల్యం చెల్లించుకోక తప్పదని వ్యాఖ్యానించారు. దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కులు, సమానత్వం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో కాంగ్రెస్ నేతలు పిలుపునిచ్చారు.

# నిమ్స్ అధికారిపై ఏసీబీ సోదాలు..

- **బినామీల ఇళ్లలో ఏసీబీ సోదాలు**
- **రూ.4.94 లక్షల నగదు స్వాధీనం**
- **రూ.2.70 కోట్ల ప్లాట్ పత్రాలు గుర్తింపు**
- **పెట్టుబడులు, భూముల డాక్యుమెంట్లపై దర్యాప్తు**

నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు కొనసాగిస్తున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ).. ఆయనకు సంబంధించిన అనుమానితులు, బినామీల ఇళ్లలోనూ సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో నగదు, వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలు, ఓపెన్ ప్లాట్ డాక్యుమెంట్లు, పెట్టుబడులకు సంబంధించిన వివరాలతో పాటు పలు కీలక ఆధారాలను అధికారులు గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది.

**ధనరాజ్ ఇంట్లో నగదు స్వాధీనం**

ఏసీబీ తనిఖీల్లో నిమ్స్ ఉద్యోగి ధనరాజ్ ఇంట్లో రూ.4,94,394 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. అలాగే మహేశ్వరం ప్రాంతంలో మూడు వ్యవసాయ భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. ఈ భూముల విలువ సుమారు రూ.57 లక్షలు ఉంటుందని ఏసీబీ ప్రాథమికంగా పేర్కొంది.

**బంజారాహిల్స్‌లో రూ.2.70 కోట్ల ప్లాట్**

బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఓపెన్ ప్లాట్‌కు సంబంధించిన పత్రాలు కూడా సోదాల్లో బయటపడ్డాయి. ఈ ప్లాట్ విలువ సుమారు రూ.2.70 కోట్లు ఉంటుందని ఏసీబీ వివరించింది. ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఎవరిపేర్లపై ఉన్నాయి, వాటికి నోరి లక్ష్మీ భాస్కర్‌తో ఉన్న సంబంధం ఏంటి అనే కోణంలో అధికారులు వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఉద్యోగి పేరుతో పెట్టుబడులు**

నిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి డి. గణేష్ పేరుతో సుమారు రూ.20 లక్షల పెట్టుబడులకు సంబంధించిన వివరాలను కూడా ఏసీబీ గుర్తించింది. మరో వ్యక్తి పేరుతో ఉన్న పెట్టుబడుల వివరాలు కూడా అధికారుల దృష్టికి వచ్చినట్లు ప్రెస్ నోట్‌లో పేర్కొంది. వీటితో పాటు రూ.3 లక్షల హ్యాండ్ లోన్‌కు సంబంధించిన రసీదులను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**మరిన్ని ఆస్తులపై దర్యాప్తు**

సోదాల్లో లభించిన పత్రాలు, నగదు, పెట్టుబడుల వివరాలు, ఇతర ఆధారాలను ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. నోరి లక్ష్మీ భాస్కర్‌కు తెలిసిన ఆదాయ వనరులతో పోలిస్తే గుర్తించిన ఆస్తులు, ఆర్థిక లావాదేవీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని లెక్కించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఏసీబీ తెలిపింది. ఇప్పటికే సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులకు సంబంధించిన వివరాలు బయటపడినట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. నోరి లక్ష్మీ భాస్కర్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణలతో ఏసీబీ సెప్టెంబర్ 21న కేసు నమోదు చేసినట్లు మీరు అందించిన ప్రెస్ నోట్‌లో పేర్కొంది. ఆ కేసు దర్యాప్తులో భాగంగానే అనుమానితులు, బినామీలుగా భావిస్తున్న వ్యక్తులకు సంబంధించిన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు ఏసీబీ వెల్లడించింది. సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా మరిన్ని ఆస్తులు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలను గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

# మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎం. ఖలీం మియా

**మెదక్ సెప్టెంబర్ 29 (ప్రజా స్వరం)**

పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఎం. ఖలీం మియా ను నియమించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ సూఫీ జానీ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఖలీం మియా మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# పోలీసుల విధులకు ఆటంకం కల్గించిన 8 మంది పై కేసు.. ఎసై గంగరాజు

**తూప్రాన్ సెప్టెంబర్ 29 (ప్రజా స్వరం ) ప్రతినిధి**

మెదక్ జిల్లా తూప్రాన్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఎనిమిది మందిపై కేసు నమోదుచేసినట్లు ఎసై గంగరాజు తెలిపారు తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో సోమవారం డయల్ 100కు కాల్ రావడంతో, సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి డయల్ 100 కాల్‌కు స్పందించే క్రమంలో
ఆ సమయంలో అక్కడే ఉన్నా జంగం నవీన్, తౌంట సతీష్, తౌంట అనిల్, గోలిపల్లి వెంకట్ రామ్ రెడ్డి , గోలిపల్లి రాజారెడ్డి, తౌంట గణేష్, జంగం కిరణ్, బుర్ర వంశీగౌడ్ అనే ఎనిమిది మంది వ్యక్తులు మద్యం సేవించిన స్థితిలో విధి నిర్వహణ లో ఉన్నా పోలీసులతో దురుసుగా ప్రవర్తిస్తూ, దుర్భాషలాడుతూ, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లు గుర్తించి
ఈ ఘటనపై తూప్రాన్ ఎసై గంగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, విధుల్లో ఉన్న సిబ్బందితో అనుచితంగా ప్రవర్తించిన వారి పై చట్టపరంగా చర్యలకు దారితీస్తుందని ఆయన తెలిపారు.



# ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి: పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి

**ప్రజాస్వరం,మేడ్చల్**

ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని పూడూరు సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న రైతు వ్యవసాయ సహకార సంఘం 49వ సర్వసభ్య సమావేశం సొసైటీ చైర్మన్ ఎన్.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సొసైటీ డైరెక్టర్లు,సొసైటీ ఎండీ సాయి దత్త చైతన్య,ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ రవి శంకర్,సొసైటీ పరిధిలోని పలువురు రైతులు హాజరయ్యారు.ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ ఎన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ నుండి రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.తమ సొసైటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన తర్వాత తీర్మానం చేసి వన్ టైం సెటిల్మెంట్ కు అవకాశం ఇవ్వగా రూ.2 కోట్ల వరకు రుణాలు వసూలు అయినట్లుగా తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ వల్ల ఎరువుల కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రభుత్వం దీన్ని తీసేయాలని కోరారు.అలాగే రాష్ట్రంలోని రైతు సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో రైతు వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్యామ్ లాల్,డైరెక్టర్లు స్వరూప,మలోత్ రవి,విఠల్ రెడ్డి,వీరేందర్ గౌడ్,చిన్న మల్లేష్,మామిండ్ల శ్రీశైలం,డి విజయ్ కుమార్,అర్జున్, బి.శ్రీనివాస్ గౌడ్,తునికి సత్తెమ్మ,రైతులు తదితరులు పాల్గొన్నారు.




# బాధిత కుటుంబాలకు కంతారెడ్డి తిరుపతిరెడ్డి భరోస..

- **మృతుల కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు..**

**చిన్న శంకరంపేట ( ప్రజా స్వరం ) సెప్టెంబర్ 29**

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, బాధితుల కష్టాల్లో భాగస్వామిగా ఉంటున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంతారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం చిన్న శంకరంపేట మండలంలో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. చందంపేట గ్రామానికి చెందిన విలేకరి తాటికొండ సుధాకర్ తండ్రి కృష్ణ ఇటీవల మృతి చెందారు కంతారెడ్డి తిరుపతిరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి, కృష్ణ మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.అనంతరం జంగారాయి గ్రామానికి చెందిన బొమ్మరబోయిన కృష్ణ కుమార్తె కీర్తన ప్రైవేట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కీర్తన మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఆయనతో పాటు గ్రామ అధ్యక్షుడు గడ్డం సురేష్, మాజీ మార్కెట్ డైరెక్టర్ బందెల ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ చౌటకూరి శ్యామ్, యూత్ అధ్యక్షుడు దుర్గం మహేష్‌గౌడ్, సిద్ధ రాములు, బందెల బన్ని, కరోల అనిల్, దేవదాస్, ముత్యాలు, భూపాల్‌రెడ్డి, గడ్డం నందు, నరసింహులు, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీపతి, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బందెల సుధాకర్, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, రామాయపల్లి సర్పంచ్ రేణుక తిరుపతి, మాజీ సర్పంచ్ గుగులోత్ సుధాకర్, మాజీ ఎంపీటీసీ బాచుపల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ తోట రమేష్, గజట్లపల్లి ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.





# అమూల్ మిల్క్ డైరీ అక్టోబర్ 4న శంకుస్థాపన..

- **అమితాషా రాక**
- **మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు**

**తూప్రాన్ సెప్టెంబర్ 28 (ప్రజా స్వరం ) ప్రతినిధి**

మెదక్ జిల్లా తూప్రాన్ మండలం బ్రాహ్మణపల్లిలో అక్టోబర్ 4వ తేదీన అమూల్ సంస్థ భూమి పూజకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నానట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు అమూల్ రాకతో మెదక్ జిల్లాలో ఉన్న పాడి పశువు రైతులకు ప్రయోజనంలాభం కలుగుతుంది, అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అయన అన్నారు మెదక్ జిల్లా ప్రజలకు రానున్నాయి.అని ఎంపీ అన్నారు మెదక్ జిల్లాకు అమూల్ మిల్క్ డైరీ రావడానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు కృషి ని జిల్లా బిజెపి నాయకులు అభినందించారు ఈ శంకుస్థాపన కార్యక్రమానికి సంబందించిన పరిస్థితులను మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు స్థానిక అర్డీఓ బావయ్య డిఎస్పీ నరేందర్ గౌడ్ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధామల్లేష్‌గౌడ్ జిల్లా నాయకులు రాంమోహన్ గౌడ్ జానకిరామ్ గౌడ్ యదగిరి గోవింద్ పోచయ్య తూప్రాన్ బిజెపి కౌన్సిలర్ లు స్వామి అశోక్ పరిశీలించారు.





# కాంగ్రెస్ కౌన్సిలర్ల చొరవతో ఆర్‌అండ్ఆర్ కాలనీకి వైకుంఠధామం

- **ఆరేళ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం.. రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు**

**గజ్వేల్, ప్రజాస్వరం :**

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో పునరావాసం పొందిన ఆర్‌అండ్ఆర్ కాలనీ ప్రజల చిరకాల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. వైకుంఠధామం, కబ్రస్థాన్ ఏర్పాటుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల సమస్యను కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రత్యేక చొరవతో పరిష్కరించేందుకు కృషి చేశారు. అధికారుల నిర్ణయంతో సర్వే నంబర్ 297లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. కాలనీ కౌన్సిలర్లు ఉపేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, నర్సింహారెడ్డిలు వైకుంఠధామం, కబ్రస్థాన్ కోసం స్థలం అవసరమున్న విషయాన్ని మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వందలాది నిర్వాసిత కుటుంబాలకు ఈ సదుపాయాలు అత్యవసరమని వివరించారు. స్పందించిన నర్సారెడ్డి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరారు.
దీంతో అధికారులు స్పందించి సర్వే నంబర్ 297లో మొత్తం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఈ నెల 28న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఇందులో ఒక ఎకరం వైకుంఠధామానికి, మరో ఎకరం కబ్రస్థాన్‌కు కేటాయించారు. దీంతో ఆరేళ్లుగా స్థలం కోసం ఎదురుచూస్తున్న ఆర్‌అండ్ఆర్ కాలనీ ప్రజల సమస్యకు పరిష్కారం లభించింది.

**కాలనీవాసుల హర్షం**

వైకుంఠధామం, కబ్రస్థాన్ కోసం స్థలం కేటాయించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేసిన కౌన్సిలర్లను అభినందించారు. నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ఇదే విధంగా నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉపేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, నర్సింహారెడ్డితో పాటు ఆర్‌అండ్ఆర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



# వివిధ భాషల్లో నటన.. నిత్య విద్యార్థిలా అనిపిస్తోంది



దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వరుస ఆఫర్లతో బిజీగా ఉన్నారు రాశీఖన్నా. హిందీ, తమిళం, తెలుగు భాషల్లో సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇలా భిన్న భాషల్లో నటించడం అంత సులభం కాదంటున్నారు. విభిన్న భాషల యాసలు, ఉచ్చారణ నేర్చుకోవడం ఒక నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

తాజాగా అభిమానులతో నెట్టింట ముచ్చటించిన (ఆస్క్ మీ ఎనీథింగ్) రాశీఖన్నా.. సినిమాల కోసం తాను పడే కష్టాన్ని పంచుకున్నారు. “నిజం చెప్పాలంటే నా జీవితమంతా ఓ పరీక్ష రాస్తున్నట్లే అనిపిస్తుంది. ఈ పరీక్షకు ముగింపు ఉండదు. ఒక సినిమాకు ఒక భాష, దానికి తగ్గ యాస, ఉచ్చారణ నేర్చుకోవాలి. అది పూర్తవ్వగానే మరో భాషలో ప్రాసను పట్టుకోవాలి. ఈ పరీక్షలకు ఎప్పటికీ ‘గ్రాడ్యుయేషన్ డే’ ఉండదు” అని సరదాగా వ్యాఖ్యానించారు. భిన్నమైన ఇండస్ట్రీల్లో నటిస్తున్నప్పుడు పాత్రలో ఒదగాలంటే.. వీటిపై పట్టు సాధించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాశీఖన్నా చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. రాజ్ అండ్ డీకే తెరకెక్కిస్తున్న పాపులర్ వెబ్ సిరీస్ ‘ఫర్జీ’ రెండో సీజన్‌లో ఆమె నటిస్తున్నారు. కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీకాంత్‌కు జోడీగా ‘ధర్మన్’ తమిళ యాక్షన్ థ్రిల్లర్‌లో నటించే అవకాశం దక్కించుకున్నారు. అలాగే బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, విద్యాబాలన్ ప్రధాన పాత్రల్లో, అనీస్ బజ్మీ దర్శకత్వం వహిస్తున్న మరో హిందీ చిత్రంలోనూ రాశీఖన్నా కీలక పాత్ర పోషిస్తున్నారు.

# స్టార్‌డమ్ ఎవరి సొత్తు కాదు..



బాలీవుడ్ స్టార్ నటుడు ఆయుష్మాన్ ఖురానా స్టార్‌డమ్ గురించి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన సినిమా రంగంలో ఒకప్పుడు ఉన్న స్టార్ హోదా పద్ధతి ఇప్పుడు పూర్తిగా మారిపోయిందని ఆ రోజులు పోయాయని అన్నారు. "ఒకప్పుడు హీరో అంటే కొద్దిమందికే పరిమితమైన ఒక పెద్ద హోదా. కానీ ఇప్పుడు రకరకాల ఎంటర్‌టైన్‌మెంట్ వేదికలు వచ్చేశాయి. యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇలా ప్రతి వర్గానికి కొందరు స్టార్లు ఉన్నారు. ఒక చోట పెద్ద స్టార్‌గా ఉన్న వ్యక్తి గురించి ఇంకో చోట ఉన్నవారికి తెలియకపోవచ్చు. అందుకే ఇప్పుడు స్టార్‌డమ్ అనేది అందరికీ ఒకేలా ఉండదు. స్టార్‌డమ్ అనేది ఎవరి సొత్తు కాదు. అసలైన స్టార్ అంటే మంచి కథ మాత్రమే" అని చెప్పారు. అలాగే ప్రేక్షకులతో ఉండే సంబంధం గురించి చెబుతూ.. "కొందరు హీరోలు అసలు బయటకు రారు, మీడియాతో మాట్లాడరు. కానీ నేను రేడియో, టీవీ రంగాల నుంచి వచ్చాను కాబట్టి సాధారణ ప్రజలతో మాట్లాడటం నాకు అలవాటు. నా కథలు సమాజంలోని నిజ జీవితానికి దగ్గరగా ఉంటాయి. అందుకే నాలోని నటుడు బతికి ఉండాలంటే నేలమీద ఉన్న సామాన్య జనంతో నిరంతరం మాట్లాడుతూనే ఉండాలి" అని ఆయన స్పష్టం చేశారు.

# ‘సార్పట్ట’ రెండో రౌండ్ షురూ

బాక్సింగ్‌కి 70వ దశకం నాటి ఎమర్జెన్సీ పరిస్థితులను జోడించి తీర్చిదిద్దిన చిత్రం ‘సార్పట్ట పరంబరై’. 2021లో విడుదలైన ఈ సినిమా సినీప్రియుల్ని విశేషంగా ఆకట్టుకుంది. పా.రంజిత్ తెరకెక్కించిన ఈ చిత్రంలో ఆర్య కథానాయకుడిగా నటించారు. ఈ పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామాలో బాక్సింగ్‌పై ఇష్టమున్న యువకుడిగా, తల్లి మాటని జవదాటని కుమారుడిగా తనదైన నటనతో ఆకట్టుకున్నారు ఆర్య. అప్పటి బాక్సింగ్ సంస్కృతిని కళ్లకు కట్టినట్లు చూపించిన ఈ సినిమాకు సీక్వెల్‌గా ‘సార్పట్ట 2’ రాబోతున్నట్లు ఈ మధ్యే ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్ర షూటింగ్‌ను ప్రారంభించినట్లు అధికారికంగా వెల్లడిస్తూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ఫొటోను పంచుకున్నాయి సినీ వర్గాలు. “‘సార్పట్ట’ ఆవిర్భావం మొదలైంది. రెండో రౌండ్ షురూ అయ్యింద”నే వ్యాఖ్యల్ని జోడించాయి.



# సంక్రాంతి బరిలో మమిత బైజు.. ‘హలో డియర్’ రిలీజ్ ఎప్పుడంటే?



‘ప్రేమలు’ సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన మలయాళ బ్యూటీ మమిత బైజు వరుస విజయాలతో బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇటీవల ఆమె నటించిన చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ.200 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాయి. కెరీర్ ప్రారంభంలోనే ఒక హీరోయిన్ ఖాతాలో ఇలాంటి అరుదైన కలెక్షన్ల రికార్డు నమోదవటం విశేషం. ఇలా బాక్సాఫీస్ లక్కీ చార్మ్‌గా మారిన మమిత బైజు, ఇప్పుడు తన లేటెస్ట్ మూవీ ‘హలో డియర్’తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

ఈ చిత్రంలో ఆమె సరసన ‘ప్రేమలు’ ఫేమ్ సంగీత్ ప్రతాప్ హీరోగా నటిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ హిట్ ‘ప్రేమలు’ తర్వాత మమిత బైజు, సంగీత్ ప్రతాప్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లోనూ, ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. డినోయ్ పాలోస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమైనట్లు సమాచారం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దించేందుకు మేకర్స్ పక్కా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. పండుగ రేసులో పెద్ద పెద్ద సినిమాలకు పోటీగా ‘హలో డియర్’ థియేటర్లలోకి అడుగుపెట్టబోతుండటంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మేజిక్ రీక్రియేట్ చేస్తుందోనని సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# నా చిన్ననాటి రాముడు నా కళ్లముందే నిలబడినట్లు అనిపించింది

భారతీయ చలనచిత్ర పరిశ్రమలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘రామాయణ’. ప్రతిభావంతుడైన దర్శకుడు నితేష్ తివారీ ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డిఎన్‌ఇజి(?) — విఎఫ్ఎక్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ చిత్రంలో శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతాదేవిగా సాయి పల్లవి నటిస్తుండగా, రావణాసురుడిగా కన్నడ రాకింగ్ స్టార్ యష్ కనిపిస్తున్నారు. అలాగే హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే, మండోదరి పాత్రలో కాజల్ అగర్వాల్, శూర్పనఖగా రకుల్ ప్రీత్ సింగ్ అలరించనున్నారు.

ఈ రామాయణ కథను రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేశారు. అందులో మొదటి భాగం ఈ ఏడాది దీపావళి కానుకగా నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. తాజాగా, జరిగిన ఓ ఈవెంట్‌లో సాయి పల్లవి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. రణబీర్ కపూర్ శ్రీరాముడి గెటప్‌ను సెట్స్‌లో చూసినప్పుడు తనకు కలిగిన అనుభూతిని పంచుకుంది. చిన్నప్పటి నుంచి తన మనసులో శ్రీరాముడి రూపం ఎలా ఉండేదో, ఆ ముఖంలో కనిపించే అమాయకత్వం, ప్రశాంతత.. అవన్నీ సరిగ్గా రణబీర్ లుక్‌లో చూసి తను ఆశ్చర్యపోయానని చెప్పింది. తన చిన్ననాటి రాముడే నిజంగా వచ్చి కళ్లముందు నిలబడినట్లు అనిపించిందని సాయి పల్లవి చెప్పుకొచ్చింది.

# నాగచైతన్య మైల్‌స్టోన్ మూవీ ‘NC-25’లో చాన్స్ దక్కించుకున్న యంగ్ బ్యూటీ?

టాలీవుడ్‌లో సరికొత్త గ్లామర్‌తో వరుస అవకాశాలు దక్కించుకుంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారుతోంది యంగ్ బ్యూటీ సాత్మిక వీరవల్లి. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ‘ఆకాశంలో ఒక తార’ సినిమాతో ఈ భామ హీరోయిన్‌గా టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 20న గ్రాండ్‌గా థియేటర్లలోకి రావడానికి సిద్ధమవుతోంది. అయితే, తన మొదటి సినిమా ఇంకా విడుదల కాకముందే ఈ ముద్దుగుమ్మ తన అందం, ప్రతిభతో ఇండస్ట్రీలోని ప్రముఖ దర్శకనిర్మాతలను బాగా ఆకట్టుకుంటోంది. ఈ క్రమంలోనే సాత్మికకు టాలీవుడ్‌లో ఒక బంపర్ ఆఫర్ వరించినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి.

అక్కినేని నాగచైతన్య కెరీర్‌లో మైల్‌స్టోన్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న 'NC25' సినిమాలో సాత్మిక హీరోయిన్‌గా ఎంపికైనట్లు టాక్. దర్శకుడు కిశోర్ చెప్పిన సరికొత్త కథ, వైవిధ్యమైన పాత్ర నాగచైతన్యకు బాగా నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌కు ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ క్రేజీ ల్యాండ్‌మార్క్ మూవీ కోసం నాగచైతన్య సరసన కొత్త ముఖం అయితే బాగుంటుందని భావించిన మేకర్స్.. సాత్మికను హీరోయిన్‌గా ఫైనల్ చేసినట్లు టాక్. డెబ్యూ సినిమా రిలీజ్ కాకముందే అక్కినేని హీరో పక్కన నటించే అవకాశం రావడంతో సోషల్ మీడియాలో సాత్విక‌ పేరు మార్మోగిపోతోంది.





# మైండ్ గేమ్ షోకు హోస్ట్‌గా తేజ సజ్జా..



బుల్లితెరపై ఇప్పటివరకు హవా సాగించిన బిగ్‌బాస్ షోకి గట్టి పోటీ ఇచ్చేందుకు మరో సరికొత్త గేమ్ షో రాబోతోంది. విదేశాల్లో, హిందీలో భారీ ఆదరణ పొందిన సూపర్ హిట్ రియాలిటీ షో 'ది ట్రైటర్స్' ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ మైండ్ గేమ్ షోకి టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "ఈ గుడ్ న్యూస్ మీ అందరితో చెప్పడానికి చాలా రోజులుగా ఎదురుచూస్తున్నాను. ఈ షోకి హోస్ట్‌గా చేయడం నాకు కొత్త అనుభవం. ఒక కొత్త రకం గేమ్‌తో, కొత్త ఉత్సాహంతో మీ ముందుకు వస్తున్నాను" అని ఎమోషనల్‌గా పోస్ట్ చేశారు. పూర్తిగా మైండ్ గేమ్స్, ఎత్తులకు పైఎత్తులతో సాగే ఈ షో ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోలో అక్టోబర్ 15 నుంచి ప్రసారం కానుందని వెల్లడించారు. ఇక ఇందులో పాల్గొనడానికి దాదాపు 20 మంది ప్రముఖ సెలబ్రిటీలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. 'హనుమాన్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న తేజ సజ్జా, ఇప్పుడు హోస్ట్‌గా కొత్త రూపంలో కనిపించబోతుండటంతో ఈ షోపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999